# కనీస వేతనాల కోసం కార్మికుల పోరుబాట.!

**జూలై 30, 31న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు..**

**రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్**



**ఉరవకొండ,జూలై17.అక్షర టైమ్స్:–** రాష్ట్రంలోని కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, ఈ డిమాండ్ సాధన కోసం జూలై 30, 31 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిలుపునిచ్చారు. ఉరవకొండలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్డ్ ఇండస్ట్రీ పరిధిలోని 72 కేటగిరీల్లో పనిచేస్తున్న వాటర్ సప్లై, పెట్రోల్ బంక్, గార్మెంట్, సిమెంట్, స్టీల్, గ్యారేజీలు, షాపింగ్ మాల్స్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గ్రామపంచాయతీ, గిగ్ వర్కర్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి కనీస వేతనాలను సవరించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలో గత 15 ఏళ్లుగా వాటిని పెంచలేదని విమర్శించారు. ఇదే సమయంలో నిత్యావసర వస్తువులు, విద్య, వైద్యం, రవాణా తదితర ఖర్చులు విపరీతంగా పెరగడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా వేతనాల సవరణ జరుగుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్ (వీడీఏ) అమలు చేయకపోవడంతో ఒక్కో కార్మికుడు సుమారు రూ.1.50 లక్షల మేర నష్టపోయినట్లు తెలిపారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, మున్సిపల్, గ్రామపంచాయతీ, హమాలీ తదితర స్కీమ్ వర్కర్లపై పనిభారం పెంచుతున్నా, వేతనాల పెంపుపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వెంటనే నెలకు రూ.26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో కార్మిక ఉద్యమాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. జూలై 30న పంచాయతీ, మున్సిపల్, హమాలీ, షెడ్యూల్డ్ ఇండస్ట్రీ కార్మికులు, జూలై 31న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఇతర స్కీమ్ వర్కర్లు పెద్దఎత్తున కలెక్టరేట్ల ఎదుట జరిగే ధర్నాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్మికులకు సంఘీభావంగా రైతు సంఘం, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి, మధుతో పాటు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ఆనంతపురము జిల్లా /శ్రీ సత్యసాయి జిల్లా

# ప్రజాకవి యోగి వేమన తత్వానికి ఏఐ సాంకేతికత జోడింపు

**కటారుపల్లిలో 'యోగి వేమన విజ్ఞాన యాత్ర-ఏఐ బస్సు'కు ఎమ్మెల్యే కందికుంట శ్రీకారం**

**వేమన సందేశాన్ని ప్రపంచానికి చేర్చడమే లక్ష్యం**

**విద్యార్థుల్లో విజ్ఞానం, విలువలు పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమం**





**కదిరి,జూలై17.అక్షర టైమ్స్:–** ప్రజాకవి యోగి వేమన తత్వాన్ని ఆధునిక సాంకేతికతతో మేళవిస్తూ విద్యార్థులు, యువతకు చేరువ చేసే దిశగా కదిరి నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామంలోని యోగి వేమన జీవసమాధి పుణ్యక్షేత్రం వద్ద "యోగి వేమన విజ్ఞాన యాత్ర--ఏఐ విజ్ఞాన్ బస్సు ను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యోగి వేమన బోధించిన నీతి, నైతిక విలువలు, సమానత్వ భావన, మానవతా దృక్పథం నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. వేమన పద్యాల్లో నిక్షిప్తమైన జీవన సత్యాలను యువతకు సులభంగా అర్థమయ్యేలా అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తూ ఈ విజ్ఞాన యాత్రను రూపొందించినట్లు తెలిపారు. ఏఐ బస్సులో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రదర్శనలు, ఆడియో–విజువల్ ప్రజెంటేషన్లు, ఇంటరాక్టివ్ సాంకేతికత ద్వారా యోగి వేమన జీవిత చరిత్ర, ఆయన రచించిన పద్యాల భావం, సామాజిక సంస్కరణల సందేశం, కదిరి ప్రాంత ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యాటక విశిష్టతలను ప్రజలకు సరికొత్త అనుభూతితో పరిచయం చేయనున్నట్లు వివరించారు. ఈ బస్సు పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థుల్లో చరిత్ర, సంస్కృతి, విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, సాంకేతికతను సానుకూల దిశగా వినియోగించే ఆలోచనను పెంపొందిస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. మహనీయుల ఆలోచనలను భవిష్యత్ తరాలకు చేరవేయడంలో ఏఐ వంటి ఆధునిక సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని, విజ్ఞాన వ్యాప్తికి ఇది నూతన దిశగా నిలుస్తుందన్నారు. కదిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, విద్యా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమవుతాయని, యోగి వేమన పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తృతంగా చాటిచెప్పే ప్రయత్నాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని యోగి వేమన విజ్ఞాన యాత్ర-ఏఐ బస్సు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# ఎస్టీయు ఆధ్వర్యంలో టెట్ మెటీరియల్ ఆవిష్కరణ

**జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి**



**అనంతపురం,జూలై17.అక్షర టైమ్స్:–** ఎస్టీయు రాష్ట్ర సంఘం ఉపాధ్యాయులకు రూపొందించిన టెట్ మెటీరియల్ ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రుద్రంపేట ప్రధానోపాధ్యాయురాలు జె.సుమంగళి చేతుల మీదుగా పాఠశాల పని గంటల తర్వాత ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సుమంగళి మాట్లాడుతూ.. ఎస్టీయు రూపొందించిన టెట్ మెటీరియల్ చాలా బాగుందని టెట్ ప్రత్యేక కరదీపిక వెల కూడా చాలా తక్కువగా ఉన్నదని అది ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉన్నదని దీనిని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉపయోగించుకొని అందరూ ఉత్తీర్ణతా మార్కులు సాధిస్తారని తెలియజేశారు. ఎస్టీయు రూపొందించిన పదవ తరగతి బుల్లెట్ స్టడీ మెటీరియల్ ను పదవ తరగతి పిల్లలు ఉపయోగించుకొని గత పరీక్షలలో 90 శాతం పైగా మార్కులు సాధించడం జరిగింది. అదేవిధంగా ప్రస్తుతం రూపొందించినటెట్ మెటీరియల్ కూడా ఉపాధ్యాయులకు అర్థమయ్యే రీతిలో ఉన్నదని అందరూ దీనిని ఉపయోగించుకొని ఉత్తీర్ణత అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శశికళ, ఆర్.యు.పి.పి రాష్ట్ర నాయకులు డాక్టర్ గురవిరెడ్డి, ఎస్టీయు జిల్లా కౌన్సిలర్ లు తిప్పయ్య, రవీంద్ర రెడ్డి, వేణు, మండల అధ్యక్షుడు అశ్వర్థ కుమార్, మహిళా నాయకులు హైమా వతి, నాగమణి, శారద, విద్యావతి దేవి, కార్యకర్తలు నాయుడు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సచ్ఛీలతకు మరో రుజువు

# కోర్టు తీర్పు జగన్ కుచెంప పెట్టు కాలవ సూటి ప్రశ్న



**రాయదుర్గం,జూలై17.అక్షర టైమ్స్:–** జగన్ ప్రభుత్వం చంద్రబాబునాయుడుపై పెట్టిన రాజకీయ కుట్రపూరిత కేసులు న్యాయస్థానాల్లో ఒక్కొక్కటిగా వీగిపోతున్నాయని, అయితే, తనపై ఉన్న సీబీఐ కేసులపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాయదుర్గంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ ఆయన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని వేలకోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేయకపోతే..? సీబీఐ కోర్టు విచారణలకు ఎందుకు హాజరు కావడం లేదు? పదేపదే ఎందుకు వాయిదాలు కోరుతున్నారని కాలవ సూటిగా ప్రశ్నించారు. కోర్టు వాయిదాలకు ఏళ్ళ తరబడి దుమ్మా కొడుతున్న జగన్ ఎంతకాలం తప్పించుకు తిరుగుతారన్నారు. అధికార దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై నమోదైన కేసుల్లో విచారణను ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ కోర్టులకు మొహం చాటేస్తున్నారని ధ్వజమెత్తారు. నిష్ట, నిబద్ధత, పారదర్శకతతో ప్రజాసేవ చేస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడుని, ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే రాజకీయ కక్షతో నాటి వైసీపీ ప్రభుత్వం వరుసగా అక్రమ కేసులు నమోదు చేసిందని ఆరోపించారు. నిష్కళంక రాజకీయ జీవితాన్ని గడిపిన చంద్రబాబు నాయుడుపై నిరాధార ఆరోపణలు చేయడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని మండిపడ్డారు. నాడు చంద్రబాబు నాయుడుపై మోపిన కుట్రపూరిత కేసులు న్యాయస్థానాల్లో ఒక్కొక్కటిగా వీగిపోతున్నాయన్నారు. ఇటీవల అసైన్డ్ భూముల వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు చంద్రబాబు నాయుడు నిజాయితీకి అద్దం పట్టిందని కాలవ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రజాప్రయోజనం ఏమాత్రం లేదని, అది పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో వేసిన కేసేనని హైకోర్టు స్పష్టం చేసిందన్నారు. రాజకీయ కక్షసాధింపునకు చట్టాలను ఆయుధంగా ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హైకోర్టు చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వానికి గట్టి హెచ్చరిక అని అన్నారు. 2019–2024 మధ్య చంద్రబాబు నాయుడుపై మొత్తం 22 కేసులు నమోదు చేశారని, అందులో 8 కేసులు సీఐడీ ద్వారా రాజకీయ దురుద్దేశంతో పెట్టించారని ఆరోపించారు. ఇన్నర్ రింగ్ రోడ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఉచిత ఇసుక విధానం వంటి అనేక అంశాల్లో నమోదైన కేసులు న్యాయస్థానాల ముందు నిలవలేకపోయాయని చెప్పారు. లోకేష్, మంత్రి నారాయణపై కూడా ఇదే విధంగా రాజకీయ కక్షతో కేసులు బనాయించారని విమర్శించారు. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠను దెబ్బతీయాలని వైసీపీ దుర్మార్గులు చేసిన కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. కోర్టుతీర్పులు వైసీపీ నాయకత్వానికి గట్టి చెంపపెట్టని, సత్యం చివరికి గెలుస్తుందనే విషయాన్ని న్యాయస్థానాలు మరోసారి నిరూపించాయన్నారు. జగన్ రెడ్డిపై ఉన్న సీబీఐ కేసుల్లో అతను ఎప్పుడు విచారణను ఎదుర్కొంటారని నిలదీశారు. ప్రజలకు దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# జీర్ణాశయ శస్త్రచికిత్సలో ఆధునిక సాంకేతికతలు

**ఖచ్చితమైన చికిత్స, వేగవంతంగా కొలుకోనే నూతన మార్గాలు**

**వైద్య నిపుణులు డా. ప్రసాద్ బాబు, డా.పి.బి పవన్ కుమార్**



**అనంతపురం,జూలై17.అక్షర టైమ్స్:–** జీర్ణాశయ (గ్యాస్ట్రోఇంటెస్టినల్) వ్యాధుల చికిత్సలో చోటుచేసుకుంటున్న ఆధునిక పురోగతులపై వైద్యులు, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్‌లో సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, అడ్వాన్స్‌డ్ లాపరోస్కోపిక్, రోబోటిక్ జీర్ణాశయ శస్త్రచికిత్స నిపుణులు డా. ప్రసాద్ బాబు టి.ఎల్.వి.డి టీమ్ నుండి అనంతపురం వాస్తవ్యులు డా.పి.బి పవన్ కుమార్ అనంతపురం సందర్శించారు. ఆధునిక జీర్ణాశయ శస్త్రచికిత్స లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాదు. రోగికి అత్యుత్తమ ఫలితాలు, అధిక భద్రత, త్వరితగతిన కోలుకునే అవకాశం, మెరుగైన జీవన నాణ్యతను అందించడం మా ప్రధాన ఉద్దేశ్యం" అని డా.పి.బి పవన్ కుమార్ తెలిపారు. అన్నవాహిక, కడుపు, కాలేయం, క్లోమగ్రంథి (ప్యాంక్రియాస్), పిత్తాశయం, పెద్దపేగు, పురీషనాళ క్యాన్సర్లు, సంక్లిష్ట హెర్నియాలు, స్థూలకాయం (ఒబెసిటీ), రిఫ్లక్స్ వ్యాధులు, ఇతర జీర్ణాశయ సంబంధిత సమస్యల చికిత్సలో మినిమల్లి ఇన్వేసివ్ సర్జరీ విశేష ఫలితాలను ఇస్తోందని ఆయన వివరించారు. రోబోటిక్ శస్త్రచికిత్స ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ సాంకేతికత ద్వారా 3ణహై డెఫినిషన్ దృశ్యాలు, అత్యంత సూక్ష్మ కదలికల నియంత్రణ, అత్యున్నత ఖచ్చితత్వం లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పెల్విస్, కాలేయం, క్లోమగ్రంథి, ఎగువ జీర్ణాశయ ప్రాంతాల్లో నిర్వహించే సంక్లిష్ట శస్త్రచికిత్సలకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీర్ణాశయ వ్యాధులపై ముందస్తు నిర్ధారణ, సమయానికి నిపుణుల వద్దకు రిఫర్ చేయడం ఎంత ముఖ్యమో కూడా వివరించారు. ముఖ్యంగా జీర్ణాశయ క్యాన్సర్లు, హెర్నియాలు, గాల్‌స్టోన్స్, క్లోమగ్రంథి వ్యాధులు, పెద్దపేగు వ్యాధులు, స్థూలకాయం వంటి సమస్యల విషయంలో ముందస్తు గుర్తింపు ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. ఆధునిక సాంకేతికత, మల్టీడిసిప్లినరీ వైద్య సేవలు మరియు సమయానుకూల చికిత్సల సమన్వయంతో రోగుల ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని డా.పి.బి పవన్ కుమార్, పేర్కొన్నారు. డా.పి.బి పవన్ కుమార్ జీర్ణాశయ క్యాన్సర్లు, హెర్నియాలు, గాల్‌స్టోన్స్, క్లోమగ్రంథి వ్యాధులు, పెద్దపేగు వ్యాధులు, స్థూలకాయం వంటి సమస్యలకు అనుభవం ఉన్నా సర్జికల్ జీర్ణాశయ వైద్యుడు. ప్రతి నెల 1వ, 3వ శుక్రవారం అనంతపురంలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఓపిడి సేవలు అందుబాటులో ఉంటాయి. ఓపిడి సేవలు కోసం సంప్రదింపు నంబర్ 9247577001 సంప్రదించాలని తెలియజేశారు. జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రపంచ స్థాయి జీర్ణాశయ శస్త్రచికిత్స సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో యశోద హాస్పిటల్స్ కట్టుబడి ఉన్నాయని ఆయన తెలిపారు. "శస్త్రచికిత్సల భవిష్యత్తు ఖచ్చితత్వం, వ్యక్తిగతీకరించిన చికిత్స, మినిమల్లి ఇన్వేసివ్ విధానాల్లోనే ఉంది. ప్రతి ప్రాంతంలోని రోగులకు అత్యాధునిక, సురక్షితమైన చికిత్స అందుబాటులో ఉండేలా చేయడం మా లక్ష్యం" అని డా.పి.బి పవన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మార్కెటింగ్ ఏజీఎం రామ్ ప్రసాద్, మేనేజర్లు సుదర్శన్ రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో తొలి వసతి గృహం మనమే పూర్తి చేశాం

**విద్య, భోజనం, భవనాలు అన్నింటా నాణ్యతే.. నారా లోకేష్ లక్ష్యం**

**ఆత్మకూరు జూనియర్ కళాశాల భవనాల ప్రారంభోత్సవంలో పరిటాల సునీత**

**పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత**

**పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేదన్న ఎమ్మెల్యే సునీత**

**ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం**





**అనంతపురం,జూలై17.అక్షర టైమ్స్:–** ఉమ్మడి జిల్లాలో తొలి వసతి గృహాన్ని మనమే పూర్తి చేశామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల భవనాలను ఆమె ప్రారంభించారు. దీంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. టపాసులు కాలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్నారు. ముందుగా ఆత్మకూరు మండల కేంద్రంలో 56 లక్షల ఎన్.హెచ్.ఎం నిధులతో నిర్మించబోవు పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆమె కస్తూరిబా జూనియర్ కళాశాలకు వెళ్లగా.. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సునీతకు ఆత్మీయ స్వాగతం పలికారు. అక్కడ 2కోట్ల 12లక్షల రూపాయల ఏ.డబ్ల్యూ.పీ నిధులతో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. కళాశాల నూతన భవనాలను పరిశీలిస్తూ.. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం భోజనశాలను సందర్శించి భోజనం రుచి, నాణ్యతను చూశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల వసతి గృహాల నిర్మాణం జరుగుతున్నప్పటికీ ముందుగా పూర్తి చేసింది మాత్రం మనమేనన్నారు. ఆత్మకూరులో ప్రారంభమైన వసతి గృహం.. కూటమి ప్రభుత్వంలో తొలి భవనంగా నిలిచిందన్నారు. విద్యాసంస్థల్లో ఏ పని జరిగినా నాణ్యతగా ఉండాలన్నదే మంత్రి నారా లోకేష్ లక్ష్యం అన్నారు. విద్య అయినా, భవనాలైనా, భోజనమైనా ఏదైనా సరే క్వాలిటీ ముఖ్యమన్నారు. పిల్లలు ఇబ్బంది పడకూడదని సోలార్ హీటర్స్ కూడా పెట్టించారన్నారు. దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని.. దీనిని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణగా ఉండాలని సూచించారు. జూనియర్ కళాశాల వయసులో పిల్లల మనసు పక్కదారి పట్టించే అవకాశాలు ఉంటాయని.. ఇలాంటి వాటి పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరోవైపు పాఠశాలలో రాజకీయాలకు తావు లేదని.. ఎవరైనా సరే ఇక్కడ రాజకీయ కార్యక్రమాలు, ప్రసంగాలు ఉండకూడదన్నారు. గతంలో జగన్ రెడ్డి పిల్లలకు అందించే పుస్తకాలు, బ్యాగులు, చివరకు తిండి పదార్థాల మీద కూడా తన పేరు, ఫోటోలు వేయించుకున్నారన్నారు. మంత్రి లోకేష్ వీటికి స్వస్తి పలికి సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల ఫోటోలతో వాటిని పంపిణీ చేస్తున్నారన్నారు. 22వ తేదీ నుంచి డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, ప్రముఖులు, రాజకీయ నేతల నుంచి పాఠశాల అభివృద్ధికి విరాళాల సేకరణ చేపట్టినట్టు తెలిపారు. పాఠశాలకు సాయం చేస్తే.. ఐటీ మినహాయింపు కూడా ఉంటుందన్నారు. ఆత్మకూరు మండలలో ఈ రెండేళ్లలోనే సుమారుగా 60 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని.. ఇందులో రోడ్లు, పలు భవనాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం ఉందన్నారు. ముఖ్యంగా 3కోట్ల 27లక్షలతో మదిగుబ్బ - పి.కొత్తపల్లి రోడ్డు, 2కోట్ల 19లక్షలతో ఆత్మకూరు--కురాకులపల్లి రోడ్డు, 35 కోట్లతో తాగునీటి కొరకు సీపీడబ్ల్యూఎస్ పథకం కింద పనులు, 6కోట్ల 60లక్షలతో గొరిదిండ్ల, తోపుదుర్తి 33/11 కేవీ సబ్ స్టేషన్లు నిర్మాణం చేసినట్టు వివరించారు.

**ప్రజా సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సునీత ఫోకస్**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ముందుకు సాగుతున్నారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను ఓపిగ్గా వింటూ .. కొన్నింటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ, పింఛన్లు, కమ్యూనిటీ భవనాలు, గ్రామ పంచాయతీలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి కచ్చితమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ విషయాల మీద బాధితులకు స్పష్టతనివ్వాలన్నారు. ఎవర్నీ పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్



**గాండ్లపెంట,జులై17.అక్షర టైమ్స్:–** ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం దేయ్యామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు శుక్రవారం కటారిపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ఆయన మాట్లాడారు ఇండ్ల నిర్మాణం పింఛన్లు భోగాధమ్మ ఆలయాన్ని త్రీ పేజ్ విద్యుత్ సౌకర్యం రామాలయం వీధిలోని నీటి సమస్య మసీదుకు ప్రహారారిగోడ నిర్మాణం భూ సమస్యలు వినతలు రాగా అక్కడికక్కడే సంబంధించిన అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు త్రాగునీటి కోసం త్వరలోనే బోరు బావి తవ్వించి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు ప్రజా సమస్యల పరిష్కారనీకె ప్రజా దర్బార్ నిర్వహించారు ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు అనంతరం యోగి వేమన ఉన్నత పాఠశాల రూ.20 లక్షలతోపి నిర్మించిన ప్రహరీ గోడ శిలాఫలకాన్ని మండల అధికారులు నాయకులు కలిసి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ వెంకట ప్రసాద్ మండల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు

## రెండు నెలలుగా తాగునీరు లేక బీటిపల్లి వాసుల ఇబ్బందులు

### అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం



**గుడిబండ,జూలై17.అక్షర టైమ్స్:-** గుడిబండ మండల పరిధిలోని తాలికేర గ్రామపంచాయతీకి చెందిన బీటిపల్లి గ్రామంలోని బసవనపల్లి రోడ్ వీధి ప్రజలు గత రెండు నెలలుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి మోహన్, ఎంఈఓ ప్రసాద్ రెడ్డి విఫలమయ్యారని గ్రామస్థులు ఆరోపించారు. వెంటనే స్పందించి గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని మహిళలు రంగమ్మ, గంగమ్మ, సుజాత, శ్రీదేవి, లక్ష్మమ్మ, రామక్క, మంజుల, శిల్ప, హనుమక్క, ఈరాలమ్మ తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తాలికేర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు రమేష్ విలేకరులకు తెలిపారు.

## గుడిబండ పంచాయతీ కార్యదర్శిగా ఎస్.లక్ష్మప్ప బాధ్యతల స్వీకరణ



**గుడిబండ,జూలై17.అక్షర టైమ్స్:-** గుడిబండ గ్రామపంచాయతీలో నూతన పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-1)గా ఎస్. లక్ష్మప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం నుంచి పదోన్నతి ద్వారా గుడిబండ మండలానికి బదిలీపై వచ్చిన ఆయన, గుడిబండ గ్రామపంచాయతీ కార్యాలయంలో పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో కేశవ రెడ్డి, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ రాంభూపాల్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు నాయక్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొని ఎస్. లక్ష్మప్పకు శుభాకాంక్షలు తెలిపారు .గ్రామాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఆషాడమాసం సందర్భంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు





**యాడికి,జులై17.అక్షర టైమ్స్:-** మండల కేంద్రం ఆర్యవైశ్య వీధిలో వెలిసిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాడ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి గోరింటాకుతో అలంకరించి సుప్రభాత సేవ, గంగపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి సాయంత్రం ఏడు గంటలకు కుంకుమార్చన మణిద్వీప వర్ణన లలితా సహస్రనామావళి రథోత్సవం నడుమ మహిళలు కోలాటం చేస్తూ భక్తి పాటలు పాడుతూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి దర్శించిన భక్తులకు గంగవరం ఫ్యామిలీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


## అగాపే ఆశ్రమంలో అన్నదానం



**యాడికి,జులై17.అక్షర టైమ్స్:-** మండల కేంద్రం కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఆగాపే ఆశ్రమంలో ఉక్కిసల హరికృష్ణ 30వ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులు ఉక్కేసల హరికృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో ఉక్కిసల రమణ, కిట్టమ్మ, హరికృష్ణ మిత్రులు పాల్గొన్నారు.

## పామిడిలో 29న గురుపౌర్ణమి సందర్భంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

### ప్రఖ్యాతి చెందిన శ్రీదేవి కూచిపూడి కళాక్షేత్రం వారి బాలికలచే ప్రదర్శన



**పామిడి,జూలై17.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని పెన్నానది నడిబొడ్డున వెలసిన శ్రీషిరిడి సాయిబాబా దేవాలయం ఆవరణములో 29 బుధవారం గురుపౌర్ణమి మహోత్సవము సందర్భంగా రాత్రి 7 గంటలకు ప్రఖ్యాతి చెందిన అనంతపురం శ్రీదేవి కూచిపూడి కళాక్షేత్రం వారి బాలికలచే భారత సంప్రదాయమైన ఆధ్యాత్మిక శాస్త్రీయసాంస్కృతిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించబడుచున్నవని ఆ దేవాలయ పీఠాధిపతి సనారి వీరయ్యస్వామి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజున వేకువ జామున5 గంటల నుండి వేద పండితులచే అభిషేకములు అర్చనలు సరళీ పూజలు నిర్వహించబడునని, 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దాదాపు 3,000 మందికి అన్నదాన కార్యక్రమం జరుపుతున్నట్లుగా ఆయన తెలిపారు, తదుపరి స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వారిచే గొప్ప నటీనటులతో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనములు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున యావన్మంది భక్తాదులు పాల్గొని కార్యక్రమాలన్నీ భక్తిశ్రద్ధలతో నిష్టాగరిష్టులై తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి శ్రీషిరిడి సాయిబాబా కృపకు పాత్రులు కావలసినదిగా ఆయన కోరారు.

## పంచాయతీ శాఖ చొరవతో బస్‌స్టాప్ పునరుద్ధరణ

### నిరుపయోగంగా మారిన బస్‌స్టాప్‌కు పునర్వైభవం

### ప్రయాణికుల కోసం బస్‌స్టాప్‌కు కొత్త రూపు






**ముదిగుబ్బ,జులై17.అక్షర టైమ్స్:-** ముదిగుబ్బ పట్టణంలో చాలా కాలంగా నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరుకున్న బస్‌స్టాప్‌కు పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో కొత్త రూపు తీసుకొచ్చారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పంచాయతీ శాఖ కార్యదర్శి నరేంద్ర, ఈఓఆర్డీ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్‌స్టాప్‌ను పునరుద్ధరించారు. మొదటగా బస్‌స్టాప్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, ముళ్లపొదలు, కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి పరిశుభ్రత పనులు చేపట్టారు. అనంతరం దెబ్బతిన్న గోడలు, సిమెంట్ భాగాలను మరమ్మతు చేయడంతో పాటు బస్‌స్టాప్‌కు రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా సౌకర్యాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ పాల్గొని అధికారులను అభినందించారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. అదేవిధంగా పంచాయతీ కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు సమిష్టిగా శ్రమించి బస్‌స్టాప్‌ను అందంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. వారి సేవలను స్థానికులు ప్రశంసించారు. బస్‌స్టాప్ పునరుద్ధరణతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తదితర ప్రయాణికులు ఇకపై ఎండ, వర్షం నుంచి రక్షణ పొందుతూ సౌకర్యవంతంగా బస్సుల కోసం వేచి ఉండే అవకాశం కలిగిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని గ్రామస్థులు కోరారు. ఈ చర్యతో చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్న బస్‌స్టాప్ మళ్లీ ప్రజల సేవలోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## పాత్రికేయునిపై సీఐ నాగేంద్ర బాబు దురుసు ప్రవర్తన ఆరోపణలు

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల పాత్రికేయుల డిమాండ్

### తహసీల్దార్‌కు వినతిపత్రం

### చర్యలు లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిక




**నల్లచెరువు,జూలై17.అక్షర టైమ్స్:-** గాండ్లపెంటకు చెందిన పాత్రికేయుడు బాలరాజుపై కదిరి రూరల్ సీఐ నాగేంద్రబాబు అసభ్యంగా ప్రవర్తించి, దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారంటూ ఆరోపిస్తూ సంబంధిత అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ రవి నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ.. ప్రమాదానికి గురైన వ్యక్తులకు సేవా దృక్పథంతో సహాయం చేస్తున్న సమయంలో ఎలాంటి కారణం లేకుండానే సీఐ నాగేంద్రబాబు అసభ్య పదజాలంతో దూషించి, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయుల పట్ల ఇలాంటి వ్యవహారం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న పాత్రికేయులను అవమానించడం, బెదిరించడం సమంజసం కాదని, బాధ్యులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని పాత్రికేయులకు భరోసా కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాలరాజును మానసికంగా భయాందోళనలకు గురిచేసిన పోలీసు అధికారిపై నిష్పక్షపాత విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పాత్రికేయ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మదన్ కుమార్ , శ్రీనివాసులు, శివశంకర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, రొద్దం విజ్జిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మల్లికార్జున నాయుడు తదితర మండల పాత్రికేయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర యోగా పోటీలకు బ్లూమూన్ విద్యార్థుల ఎంపిక

### జిల్లాస్థాయిలో సత్తా చాటి రాష్ట్రస్థాయికి అర్హత

### విద్యార్థులను అభినందించిన యాజమాన్యం

**కదిరి,జూలై17.అక్షర టైమ్స్:-** కదిరిలోని గంగమ్మ మోరి ఎదురుగా ఉన్న బ్లూమూన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. యోగా అసోసియేషన్ ఆఫ్ అనంతపురం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పలు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. పాఠశాల విద్యార్థిని జి. అభిజ్ఞ రెడ్డి (3వ తరగతి) అండర్ -8 నుంచి 10 సంవత్సరాల బాలికల విభాగంలో ప్రథమ స్థానం, త్రిష శ్రీవాస్తవ (7వ తరగతి) అండర్ -10 నుంచి 12 సంవత్సరాల బాలికల విభాగంలో ద్వితీయ స్థానం, గజవర్ధన్ నాయక్ (10వ తరగతి) అండర్ -14 నుంచి 16 సంవత్సరాల బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత ఎం. శివశంకర్ మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తుండటం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలోనూ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ, బ్లూమూన్ విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. పాఠశాల ఇన్‌చార్జ్ సి. మాధవరెడ్డి మాట్లాడుతూ, ఆహ్లాదకరమైన వాతావరణంలో అనుభవజ్ఞులైన శిక్షకుల పర్యవేక్షణలో విద్యార్థులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు జి. రామాంజుల రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు మరింత కృషితో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




ఈ కార్యక్రమంలో పీటీఈ డ్యానియల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలను ఘనంగా అభినందించారు.

## వర్షం కోసం శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లికి 1008 కలిశాలతో జలాభిషేకం







**యాడికి,జులై17.అక్షర టైమ్స్:-** మండల కేంద్రం మెయిన్ బజార్లో వెలిసిన పెద్దమ్మ తల్లికి ఆషాడ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా వర్షం కోసం 1008 కలిశాలతో జలాభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకం వివిధ రకాల పూలతో అలంకరించి మామిడి ఆకులు వేపమండలతో ఆలయాన్ని అతి సుందరంగా అలంకరించారు. మహా మంగళహారతి ఖడ్గమాల సమర్పించారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీశ్రీశ్రీ లక్ష్మీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానం నుండి ప్రతి సంవత్సరము లాగానే వంద రకాల పిండి పదార్థాలు స్వీట్లు పూలు పళ్ళు పుట్టింటి సారే పాత పోలీస్ స్టేషన్ ఆర్యవైశ్య మెయిన్ బజార్ లో శోభాయాత్రగా దాదాపుగా 300 మంది మహిళలు పురుషులు పెద్దమ్మ దేవస్థానం వరకు వచ్చి అమ్మవారికి సమర్పించి వేద పండితులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు పుచ్చుకున్నారు.

## అక్రమ వైద్యానికి చెక్ అఫ్రీన్ క్లినిక్ సీజ్.!

### ప్రథమ చికిత్స కేంద్రం ముసుగులో అల్లోపతి వైద్యం

### అఫ్రీన్ క్లినిక్ ను సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ఈ.బి.దేవి

**ఉరవకొండ,జూలై17.అక్షర టైమ్స్:-**పట్టణంలోని అఫ్రీన్ క్లినిక్‌లో అర్హతలు లేని వ్యక్తి అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా ట్రైనీ కలెక్టర్ షియాజ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ బి.బి. దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో క్లినిక్‌లో చట్టబద్ధమైన వైద్య అర్హతలు లేకుండానే రోగులకు అల్లోపతి వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సంబంధిత ధ్రువపత్రాలు, అనుమతులు పరిశీలించిన అనంతరం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారించి క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ బి.బి. దేవి మాట్లాడుతూ, వైద్య విద్య పూర్తి చేసి సంబంధిత వైద్య మండలిలో నమోదు పొందిన అర్హత కలిగిన వైద్యులు మాత్రమే అల్లోపతి వైద్యం చేయాలని స్పష్టం చేశారు. అర్హతలు లేకుండా వైద్యం చేయడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడినట్లేనని అన్నారు. ఇలాంటి అక్రమ వైద్య కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పోలీసు కేసులు కూడా నమోదు చేసి న్యాయపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రథమ చికిత్స కేంద్రం పేరుతో లేదా ఇతర పేర్లతో అల్లోపతి వైద్య సేవలు అందించడం, ఇంజెక్షన్లు ఇవ్వడం, మందులు సూచించడం, చికిత్స చేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ప్రజలు వైద్య సేవలు పొందే ముందు వైద్యుడికి సంబంధిత అర్హతలు, రిజిస్ట్రేషన్ ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. అలాగే ఎక్కడైనా అర్హతలేని వ్యక్తులు వైద్యం చేస్తున్నట్లు తెలిసినా వెంటనే వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అక్రమ వైద్య కేంద్రాలపై జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును



పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, స్థానిక వైద్యాధికారి డాక్టర్ వినీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి

### ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండారు కుళ్ళాయప్ప వినతి



**అనంతపురం/రూరల్,జులై17.అక్షర టైమ్స్:-** శింగనమల నియోజవర్గం శాసనసభ్యురాలు గృహములో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ లో ఎమ్మెల్యే బండారు శ్రావణి కి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్నటువంటి పేద ప్రజలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఇల్లు లేని నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారము ప్రతి పేదవానికి గ్రామాలలో మూడు సెంట్లు ఇంటి స్థలం చొప్పున అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కమిటీ సభ్యులు తిరుపాలు,బండారు కుల్లాయప్ప,వినతి పత్రం ఇవ్వడం జరిగింది మరియు ఎమ్మెల్యే తో కమిటీ సభ్యులు మాట్లడుతూ నియోజకవర్గంలో చాలామంది పేదవారు అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు, ప్రభుత్వం వారు పేదలకు ఇంతవరకు ఇంటి పట్టాలు ఇవ్వకపోవడం చాలా అన్యాయం. కావున ఇప్పటికైనా గ్రామాలలో బలహీన వర్గాలకు చెందిన దళితులు, పేదవారిని గుర్తించి, అర్హులైన వారికి మూడు సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు చేసి, వారికి పక్కా గృహాలు నిర్మించే విధంగా చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ని కోరడం జరిగింది. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాలలో అర్హులైన పేదవారినీ గుర్తించి, లిస్టు తయారుచేసి ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం పేదవారికి ఇంటి పట్టాలు వచ్చే విధంగా చొరవ చూపుతానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె తిరుపాల్, డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండారు కుల్లాయప్ప పాల్గొన్నారు

# సమాన పనికి సమాన వేతనం కై చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి సిఐటియు



**రాయదుర్గం,జూలై17.అక్షర టైమ్స్:-** మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనంకై జూలై 30న జరుగు ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రధం చేయండి అని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి. మల్లికార్జు తెలిపారు. నమున్సిపల్ కార్మికులను, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని,వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం తదితర సమస్యలుపరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 2026 జూలై 30వ తేదీన ఇతర కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, గ్రామ పంచాయితీ కార్మికులతో కలిసి నిర్వహించే 'ఛలో కలెక్టరేట్' కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి. మల్లికార్జున పిలుపునిచ్చారు.శనివారం ఉదయం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల తో కలిసి ఛల్లో కలేక్టరెట్ కు సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల వేతనాలు, వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు, వేతనాలు పెరిగి 7 ఏళ్ళు అవుతుందని, వేతనాల పెంపుకోసం ప్రభుత్వం ఎలాంటి ఆలోచన చేయటం లేదని విమర్శించారు. మరో వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రైవేటు సంస్థలలో పని చేసే షెడ్యూల్డ్ ఎంప్లాయిస్ వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం సవరణ చేయాల్సి ఉందని, 15 ఏళ్ళుగా సవరణ చేయలేదని, దీంతో వారు అతి తక్కువ వేతనాలు పొందుతున్నారని అన్నారు. తాము అధికారం లోకి వస్తే మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచే భాద్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పిన బాబు 2సంవత్సరాలు కావస్తున్న ఎందుకని మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుపై నోరు మెదపకుండా మున్సిపల్ కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని రాష్ట్రంలోని మొత్తం మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, గ్రామ పంచాయితీ, ఆర్ టి సి కార్మికులు జూలై 30వ తేదిన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నారని అన్నారు. అలాగే జూలై 31న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీమ్స్‌లో పని చేస్తున్న కార్మికులు వారి సమస్యలపై ధర్నా నిర్వహించనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ రంగంలో పిపిపి విధానాలను అమలు చేయనున్నట్లు జారీ చేసి జి.ఓలను తక్షణమే రద్దు చేయాలని, వాటి వల్ల రాష్ట్రంలోని కోటిన్నర మంది పట్టణ ప్రజానీకంపై యూజర్ చార్జీల పేరుతో భారాలను మోపడం సరైనది కాదని , అదేవిధంగా ఈ జీవోలు అమలు అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి అరవై వేల మంది మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందని అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం విధించిన "చెత్త పన్ను"కు వ్యతిరేకంగా మాట్లాడిన ఈ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత యూజర్ ఛార్జీల పేరుతో పట్టణ ప్రజానీకంపై భారాలు మోపబోతున్నారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా పట్టణ ప్రజానీకంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ ఈ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ ఈ జీవోలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాటాలకు సంసిద్ధమవుతామని తెలిపారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్మిక సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాపిత నిరవధిక సమ్మె చేయడానికి కూడ వెనుకాడబోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**పూర్తి స్థాయి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నెలకు**

**రూ.3,000 నిరుద్యోగ భృతి కల్పించాలి**

**మండల తహసీల్దార్‌కు ఏఐవైఎఫ్ వినతిపత్రం**







**బుక్కరాయసముద్రం,జులై17.అక్షర టైమ్స్:-** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో నమండల తహసీల్దార్ శ్రీధర్ మూర్తి కి నిరుద్యోగ సమస్యల పరిష్కారం, పూర్తి స్థాయి జాబ్ క్యాలెండర్ విడుదల, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది చదువుకున్న యువత ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత తీవ్ర ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ శాఖల్లో ఉన్న అన్ని ఖాళీలను వెంటనే గుర్తించి శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని, పూర్తి స్థాయి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నియామకాల షెడ్యూల్‌ను ప్రకటించాలని, నిరుద్యోగ యువతకు నెలకు కనీసం రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని, అవుట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ విధానాలకు బదులుగా రెగ్యులర్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటించి పరీక్షలు, నియామకాలను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ కోరింది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, ఖఅఎంట మండల కార్యదర్శి లోకేష్, మండల సహాయ కార్యదర్శి షమీవుల్లా, మండల ఉపాధ్యక్షులు అశోక్ వర్ధన్, ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బండారు తేజ, యువ తేజ, గణేష్,నాయకులు, ధనుష్, చరణ్, వెంకటేష్, జగ్గు, వంశీ, జాన్, తదితరులు పాల్గొన్నారు

# సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ కల్పించాలి



**రాయదుర్గం,జూలై17.అక్షర టైమ్స్:-** రాయదుర్గం మండలం మల్లాపురం పరిధిలో మోపూరు గోపాల్ రాజు రైతు పోలం లో ఎలాంటి రసాయనాలు లేకుండా, కేవలం సేంద్రియ పద్ధతుల్లో అధిక దిగుబడి సాధించడం అభినందనీయం అని డివి ఎం సి మెంబర్ డా. బి. వెంకట రమణ అన్నారు. అయన రైతు పండించిన టమోటా పోలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు లేకపోవడం వల్ల ఆయన మరియు ఇతర రైతులు ఇబ్బందులు ఎదురుకుంటున్నారు. సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ ఉ ప్రీమియం ధర ప్రత్యేక ఆర్గానిక్ బజార్స్ సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు సాధారణ మార్కెట్లలో కాకుండా, జిల్లా కేంద్రాల్లో మరియు రైతు బజార్లలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలి. కనీస మద్దతు ధర రసాయన రహిత పంటలైనందున వీటికి సాధారణ పంటల కంటే కనీసం 20% నుండి 30% అదనపు మద్దతు ధరను ప్రభుత్వం కల్పించాలి. రైతు సాధికార సంస్థ ద్వారా గుర్తింపు మరియు ప్రోత్సాహకాలు మోడల్ ఫార్మర్ గుర్తింపు మోపురి గోపాల్ గారిని జిల్లా స్థాయిలో ఒక "ఆదర్శ సేంద్రియ రైతు" గా గుర్తించి ప్రభుత్వం తరపున సన్మానించాలి.ఫీల్డ్ విజిట్స్: ఆయన పొలాన్ని ఒక శిక్షణ కేంద్రంగా మార్చి, ఇతర రైతులకు అవగాహన కల్పించేలా రైతు సాధికార సంస్థ ద్వారా టూర్లు ఏర్పాటు చేయాలి. సేంద్రియ ఎరువులు మరియు సేంద్రియ పంటలకు "ఆర్గానిక్ సర్టిఫికేషన్" పొందడం ఖర్చుతో కూడుకున్న పని. కాబట్టి ప్రభుత్వం ఉచితంగా లేదా రాయితీపై ఈ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.వేపపిండి తయారీకి అవసరమైన పరికరాలు మరియు సామాగ్రిని సబ్సిడీపై అందించాలి అని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్. డా. వెంకటరమణ కోరారు.ఈ కార్యక్రమంలో రైతు కూలీలు పాలుగొన్నారు.

# గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు





**రాయదుర్గం,జూలై17.అక్షర టైమ్స్:-** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం రూరల్ మండల పరిధిలోని బి.ఎన్.హళ్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూరాయదుర్గం నియోజకవర్గంలో గత రెండేళ్లలో 34 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు రూ.7.61 కోట్లతో సొంత భవనాల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్, నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ భవనాల నిర్మాణం జరుగుతోందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రజలకు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు స్థానికంగానే చికిత్స, వైద్య సలహాలు, సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రతి చిన్న సమస్యకూ రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం తగ్గి, ప్రజలకు సమయం, వ్యయం ఆదా అవుతుందన్నారు. పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు గ్రామస్థాయిలోనే అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇటువంటి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి జరుగుతోందన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదాలు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, కేంచానపల్లి ఎర్రిస్వామి,సిద్ధప్ప, బానేపల్లి అశోక్,మద్దానప్ప,మల్లేశప్ప తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీడీవోగా డి ప్రభాకర్ పదవి బాధ్యతలు స్వీకరించారు



**పామిడి,జూలై17.అక్షర టైమ్స్:-** పామిడి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా డి ప్రభాకర్ పూర్తి బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పతంలో నడిపించడమే నాధ్యేయం నాకర్తవ్యం అన్నారు. పామిడి మండలం నాకు కొత్తేమీ కాదని గతంలో ఎంపీడీవోగా పనిచేశానని, ఇక్కడి నుంచి గుత్తి మండలానికి ఎంపీడీవోగా బదిలీపై వెళ్లాలని, గుత్తి మండలం తో పాటు ప్రస్తుతం పామిడి మండలం కూడా పూర్తి అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది అన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు అస్వర్తనాయుడు, రంగనాయకులు, ఏవో హరినాథ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఇంజనీర్లు తదితర కార్యాలయపు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చంతో ఘనంగా స్వాగతం పలికారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని విధురాశ్వత్థ ఆలయంలో ప్రత్యేక పూజలు,అన్నదానం



**అనంతపురం,జులై17.అక్షర టైమ్స్:-** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని, ఆయనకు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమై పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలోకి రావాలని కాంక్షిస్తూ విధురాశ్వత్థ పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షులు టీసీ వరుణ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 5 వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన అత్యంత ప్రసిద్ధి పొందిన గౌరీబిదనూరు తాలూకాలోని విధురాశ్వత్థ క్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ సమేత అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో జనసేన నాయకులు ప్రత్యేక పూజలు, స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పేరిట అర్చనలు జరిపించి, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు చేకూరాలని మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు, పేదలకు భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ అబ్జర్వర్ కమిటీ సభ్యులు, నగర కార్యదర్శి విశ్వనాథ్ (3వ రోడ్డు), జనసేన పార్టీ సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రాయల్, షణ్ముఖ రాయల్, టీడీపీ యువ నాయకులు మోటుపల్లి రామ్మోహన్ నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భాజపా మండల అధ్యక్షుడిగా దేవన రమేష్ రెడ్డి



**పెద్దవడుగూరు,జులై17.అక్షర టైమ్స్:-** పెద్దవడుగూరు మండల భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడిగా వెంకటాంపల్లికి చెందిన దేవన రమేష్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు భాజపా నాయకులు రామాంజనేయులు తెలిపారు. పెద్దవడుగూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జాతీయ కౌన్సిల్ సభ్యుడు అంకాళ్ రెడ్డి, మండల ఇన్చార్జ్ తెగదొడ్డి తిమ్మరెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్నికైన రమేష్ రెడ్డి పశుసంరక్షణకు ఎంతో పాటుపడుతున్నారని మండల వ్యాప్తంగా భాజపాను బలోపేతం చేయగడని తమకు ఆత్మవిశ్వాసం ఉందని నాయకులు తెలిపారు. ఈసందర్భంగా ఎన్నికైన రమేష్ రెడ్డి మాట్లాడుతూ భాజపాను గ్రామగ్రామాన విస్తృతం చేస్తానని చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ

**ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా 5లక్షల ప్రమాద బీమా పత్రం అందజేత**

**వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు**



**అనంతపురం,జూలై17.అక్షర టైమ్స్:-** రోడ్డు ప్రమాదంలో మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. కనగానపల్లి మండలం ముక్తాపురం పంచాయతీ పర్వతదేవరపల్లి గ్రామానికి చెందిన బాబు సాహెబ్ షేక్ 2 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బాబు సాహెబ్ మరణించారు. బాబు సాహెబ్ యుక్త వయసు నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉన్నారు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే ప్రమాద బీమా కోసం దరఖాస్తు చేయించారు. పార్టీ అధిష్టానం ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ మంజూరు చేయించింది. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో బాబు సాహెబ్ భార్య రహీంబికి ఎమ్మెల్యే సునీత ప్రమాద బీమా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఒక పార్టీ కార్యకర్తకు ఇంతగా అండగా నిలబడే ఏకైక పార్టీ ఒక తెలుగుదేశం మాత్రమేనని ఎమ్మెల్యే సునీత అన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చొరవతోనే ఇలా కార్యకర్తలకు సాయం అందుతోందన్నారు.

# నేడు గజరాంపల్లికి ఎల్ నీవో పరిశీలకులు వస్తున్నారు : ఏఓ



**పామిడి,జూలై17.అక్షర టైమ్స్:-** మండల పరిధిలోని గజరాంపల్లిలోని పంట పొలాలలో పరిశీలించుటకు శనివారం ఎల్ఈఓ బృందం వస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎలనివో పరిస్థితులలో ఫైలు ఎలా ఉన్నాయి అని పరిశీలించుటకు డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వారు విచ్చేయుచున్నారు కావున రైతులందరూ పంట పొలాలకు రావలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# డివిజనల్ లెవెల్ లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

**ఎంఈఓ లు రాజేశ్వరి దేవి,గోపాల్ నాయక్**





**ధర్మవరం,జులై17.అక్షర టైమ్స్:-** ధర్మవరం డివిజన్ లోని నాన్ లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్స్ ఉపాధ్యాయులు అందరూ జూలై 18వ తేదీ డివిజనల్ లెవెల్ లో టీచర్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ బి ఎస్ ఆర్ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు.వారు మాట్లాడుతూ సోషల్ స్టడీస్, బయాలజికల్ సైన్స్, మరియు బి ఎస్ ఆర్ బాయ్స్ పాఠశాలలో శనివారం ఉదయం 9 గంటలకు మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్ సబ్జెక్టు పైన ట్రైనింగ్ ఉండును అని తెలిపారు. ,కావున డివిజన్లోని స్కూల్ అసిస్టెంట్స్ అందరూ తప్పక హాజరుకావాలని తెలిపారు. ఆయా క్లస్టర్ సి ఆర్ పి లు ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు తెలియజేయ వలసిందిగా వారు తెలిపారు.

# ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో 396 ను వెంటనే రద్దు చేయాలి

**రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పెన్ డౌన్ (ఎస్ఆర్ఓ)**



**పామిడి,జూలై17.అక్షర టైమ్స్:-** గుంతకల్ నియోజకవర్గం పామిడి పట్టణంలోని దస్తావేజు లేఖర్లు శుక్రవారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వం నూతనముగా ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 196ను వెంటనే రద్దు చేయాలని, పామిడి దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం (ఎస్ ఆర్ ఓ) సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పెన్ డౌన్ రూపంలోధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టినటువంటి జిఓ నెం.396ను వ్యతిరేకిస్తున్నామని పామిడి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు , డి.టి.పి ఆపరేటర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. 396 ను రద్దు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని మెమోరాండంను సబ్ రిజిస్టార్ కు సమర్పించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము వారు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు కక్షిదారులకు సంబంధించి స్వంత వ్యవహారమైన దస్తావేజు తయారీ విధానమును కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేయడం శోచనీయమన్నారు. వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పామిడి సబ్ రిజిష్టరు కార్యాలయం పరిధిలో ఈనెల 20నుండి 31వరకు దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు , డి.టి.పి ఆపరేటర్లు పెన్ డౌన్ చేయడం జరుగుతుందని మరియు ప్రజలు అందరు ఈనిరసన కార్యక్రమానికి సహకరించాలని వారు కోరడమైనది. బ్రిటిష్ కాలం నుంచి దస్తావేజులు వ్రాయడం ద్వారా నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నటువంటి దస్తావేజు లేఖర్ల ఉపాధిని కోల్పోవడం జరుగుతుందని. దస్తావేజు లేఖరుల వృత్తిని ప్రభుత్వ విధానాల ద్వారా తమ పొట్ట కొట్టకుండా ఉండాలని ప్రభుత్వాన్ని కోరడమైనది.

# నేడే నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు..

## జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాజుల సోమేశ్వర్ రెడ్డి



**ధర్మవరం,జులై17.అక్షర టైమ్స్:-** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జూలై 18వ తేదీ ఉదయం 10 గంటలకు, జిల్లా క్రీడల అధికారి కిషోర్ ఆదేశాల మేరకు 12 క్రీడలు అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాజుల సోమేశ్వర్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్షిప్ కప్ 2026 కు సంబంధించిన 12 క్రీడల అథెటిక్స్, అర్చరి, బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, చెస్ ,హాకీ, కబాడీ, కోకో ,వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగ, బాక్సింగ్ తదితరు క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం ఆగస్టు 29 ని పురస్కరించుకొని షాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తప్పనిసరిగా తాము తెలిపిన లింకు ద్వారా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుందని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే ఈ పోటీలకు అర్హులవుతారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9481876366కు సంప్రదించాలని తెలిపారు.

# మిషన్ మార్చి ఎస్ ఎస్ సి 2027 ను రద్దు చేయాలి ఏపీటీఎఫ్ డిమాండ్



**ధర్మవరం,జులై17.అక్షర టైమ్స్:-** మిషన్ మార్చ్ ఎస్ఎస్సి 2027 ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.మాట్లాడుతూ పదవ తరగతికి కనీస సిలబస్ కూడా పూర్తి కాకముందే మిషన్ మార్చ్ పేరుతో ఇప్పటి నుంచే అదనపు తరగతులు నిర్వహించాలనే ప్రభుత్వం నిర్ణయం అసంబద్ధం అని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బి కె ముత్యాలప్ప తెలిపారు. ధర్మవరం పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు గోపి, అంజి నాయక్, కార్యవర్గం ఆధ్వర్యం లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముత్యాలప్ప మాట్లాడుతూ సరైన ప్రణాళిక లేకుండా విద్యార్థులు, ఉపాధ్యాయుల పై అనవసర ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు సానె రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ, పెండింగ్ డి ఏ లు, ఆర్థిక బకాయిలు చెల్లించకుండా ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పైగా టెట్ పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేధింపులకు గురి చేయడం దానమన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు అమానుల్లా , జగదీష్ మాట్లాడుతూ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు,హిందీ, పీడీ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ సభ్యత్వ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యాయులు నాగభూషణ, విజయ్ కుమార్, వెంకటరాముడు ,శ్రీనివాస రెడ్డి,చెన్నూడు, వెంకటేష్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


# మాత శిశు సంరక్షణ మన ధ్యేయం

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం



**ధర్మవరం,జులై17.అక్షర టైమ్స్:-** మాత శిశు సంరక్షణయే మన ధ్యేయం అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఫై రోజా బేగం తెలిపారు. వారు ఆధ్వర్యంలో జిల్లా ప్రోగ్రాం అధికారుల తో కలిసి ధర్మవరం డివిజన్ నందు గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు , పర్యవేక్షకులకు ,ఆరోగ్య కార్యకర్తలకు ఆరోగ్య శాఖకు సంబంధించినటువంటి పలు జాతీయ కార్యక్రమాల లక్ష్యసాధన పైన వ్యాధి నిరోధక టీకాల పైన, ఎన్ సి డి సర్వే, ఆర్ సి హెచ్, సీజనల్ వ్యాధుల పైన మాతా శిశు సంరక్షణ సేవల పైన డివిజనల్ రివ్యూ పట్టణములోని ఎన్జీవో హోమ్ లో నిర్వహించడం జరిగింది. తదుపరి డాక్టర్ ఫైరోజా బేగం మేడం మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించినటువంటి టార్గెట్లను ఆన్లైన్ చేస్తూ టార్గెట్ ను పూర్తి చేయాలని, ధర్మవరం డివిజన్లో గల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులకు అర్బన్ ప్రాథమిక వైద్యాధికారులకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశించారు. జూలై నెల డెంగ్యూ నివారణ మాస ఉత్సవాలలో భాగంగా క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి జ్వర పీడుతులను గుర్తించి, వారికి సకాలంలో చికిత్సలు అందించాలని తెలిపారు. అలాగే ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నచోట లార్వాలను , దోమలను గుర్తించి వెంటనే వాటిని నిర్మూలించాలని తెలిపారు. ధర్మవరం డివిజన్ డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డివిజన్లో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించినటువంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పై కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పి సి జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా , ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీల్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ సురేష్ నాయక్ , డి పి హెచ్ ఎన్ వీరమ్మ , సి హెచ్ ఓవన్నప్ప , స్టాటికల్ ఆఫీసర్ కళాధర్ , గఫూర్ ఎంపీహెచ్ఇఓ, నాగరాజు-డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని సంవత్సరాలు రెంట్‌కి ఉంటే.. అద్దె ఇల్లు సొంతమవుతుంది.? ఎవ్వరికీ తెలియని నిజం




అద్దెకున్న వ్యక్తులు 12 సంవత్సరాలకు పైగా అద్దె చెల్లిస్తే ఆస్తికి యజమానులుగా మారతారనేది ఒక అపోహ. అయితే, భారతీయ చట్టాల ప్రకారం, అద్దెదారుడు అద్దె చెల్లిస్తూనే ఉంటే శాశ్వత అద్దెదారుడిగా మారతారే తప్ప, ఆస్తి యాజమాని టైటిల్ డీడ్ ద్వారా మాత్రమే బదిలీ అవుతుంది. యజమాని ఆస్తి పన్ను చెల్లింపుదారుగా కొనసాగుతాడు. అద్దెకున్న వ్యక్తులు ఆస్తికి పూర్తి యజమానిగా మారగలడా? అనే ప్రశ్న అనేక మందిలో గందరగోళాన్ని సృష్టిస్తుంది. అద్దెదారులు, యజమానుల మధ్య ఆస్తి హక్కులు, బాధ్యతలు, ముఖ్యంగా దీర్ఘకాలిక అద్దెకు సంబంధించిన చట్టపరమైన అంశాలను ఇప్పుడు తెలుసుకుందామా.. అద్దెదారుడు 12 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం అద్దె చెల్లిస్తూ ఉంటే, ఆ ఆస్తి అతనికి సొంతం అవుతుందనే ఒక అపోహ ఉంది. అయితే, వాస్తవ చట్టపరమైన స్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

**అద్దెదారుడి పట్ల యజమానుల తీరు, అద్దెదారుడి సమస్యలు:**

అద్దె ఇళ్లల్లో నివసించేవారు అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. ఉదాహరణకు, 25 సంవత్సరాలకు లీజుకు ఇచ్చిన షాపులను, గడువు ముగియకముందే మూడు రోజుల్లో ఖాళీ చేయమని ఆదేశించారు. జిమ్ వంటివి దశాబ్దాలుగా అద్దెకు నడుస్తున్నప్పటికీ, కొత్త యజమానులు ఖాళీ చేయమంటే తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. దీర్ఘకాలం ఒకేచోట వ్యాపారం చేయడం వల్ల ఏర్పడిన కస్టమర్ బేస్, సెటిల్మెంట్ వదిలి వెళ్లడం అద్దెదారులకు కష్టతరం. యజమానులు రెంట్ పెంచడం లేదా సమస్యలు సృష్టించడం ద్వారా వారిని ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తుంటారు.

**యజమానుల సమస్యలు, 12 సంవత్సరాల నిబంధన:**

అద్దెదారులకు సమస్యలు ఉన్నట్టే, యజమానులకు కూడా కొన్ని సవాళ్లు ఉంటాయి. కొందరు అద్దెదారులు దీర్ఘకాలం ఒక ఆస్తిలో నివసిస్తున్నప్పుడు, "12 ఏళ్లు దాటితే ఇది నాదే" అని వాదిస్తారు. దీనికి ఢిల్లీలోని కరోల్ బాగ్ ఉదాహరణ. అక్కడ ఒక ఆస్తిని 150 రూపాయల అద్దెకు తీసుకుని 50 సంవత్సరాలుగా ఖాళీ చేయకుండా ఉన్న సందర్భం ఉంది. హైదరాబాదులోని ఓల్డ్ సిటీలో వక్ఫ్ బోర్డు ఆస్తుల్లో కొందరు నెలకి ఐదు రూపాయల అద్దె కడుతూ 50 ఏళ్లుగా ఉంటున్నారు. ఇక్కడ కీలకమైన అంశం ఏమిటంటే, 12 సంవత్సరాల నిబంధన అద్దెదారుకు ఆస్తిపై యాజమాని హక్కులను కల్పించదు. చట్టం దృష్టిలో, మీరు "శాశ్వత అద్దెదారు"గా మాత్రమే ఉంటారు.

**చట్టపరమైన వివరణ యాజమాని ఎం. శాశ్వత అద్దె:**

భారతీయ చట్టం ప్రకారం, 12 సంవత్సరాలకు పైగా అద్దె చెల్లించినప్పటికీ, అద్దెదారు ఆస్తికి యజమానిగా మారడు. యజమానిని టైటిల్ డీడ్ ద్వారా నిర్ణయిస్తారు. ప్రాపర్టీ టాక్స్ ఎప్పుడూ ఆస్తి యజమాని పేరు మీదే ఉంటుంది.

# పామిడిలో 29న గురుపౌర్ణమి సందర్భంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

## ప్రఖ్యాతి చెందిన శ్రీదేవి కూచిపూడి కళాక్షేత్రం వారి బాలికలచే ప్రదర్శన









**పామిడి,జూలై17.అక్షర టైమ్స్:-** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని పెన్నానది నడిబొడ్డున వెలసిన శ్రీషిరిడి సాయిబాబా దేవాలయం ఆవరణములో 29 బుధవారం గురుపౌర్ణమి మహోత్సవము సందర్భంగా రాత్రి 7 గంటలకు ప్రఖ్యాతి చెందిన అనంతపురం శ్రీదేవి కూచిపూడి కళాక్షేత్రం వారి బాలికలచే భారత సంప్రదాయమైన ఆధ్యాత్మిక శాస్త్రీయసాంస్కృతిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించబడుచున్నవని ఆ దేవాలయ పీఠాధిపతి సనారి వీరయ్యస్వామి పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజున వేకువ జామున5 గంటల నుండి వేద పండితులచే అభిషేకములు అర్చనలు సరళీ పూజలు నిర్వహించబడునని, 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు దాదాపు 3,000 మందికి అన్నదాన కార్యక్రమం జరుపుతున్నట్లుగా ఆయన తెలిపారు, తదుపరి స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వారిచే గొప్ప నటీనటులతో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనములు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.కావున యావన్మంది భక్తాదులు పాల్గొని కార్యక్రమాలన్నీ భక్తిశ్రద్ధలతో నిష్ఠాగరిష్టులై తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి శ్రీషిరిడి సాయిబాబా కృపకు పాత్రులు కావలసినదిగా ఆయన కోరారు.

# మహిళా సంఘాల అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎద్దులపల్లి ఏపీజీబీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్

## చెప్పులు అరిగేలా తిరుగుతున్న సహకరించని అధికారి



**పామిడి,జూలై17.అక్షర టైమ్స్:-** మహిళా సంఘాల గోడు కలెక్టర్ కార్యాలయంలో విన్నవించినప్పటికీ స్పందించని గ్రామీణ బ్యాంకుఅధికారి, గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం రామగిరి గ్రామానికి చెందిన రాజేశ్వరి మహిళా సంఘం గత 15 సంవత్సరాల నుంచి ఎద్దులపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రాజేశ్వరి సంఘం తఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా తీసుకున్న లోను కడుతున్నప్పటికీ గత కొద్ది రోజులుగా ఎద్దులపల్లి గ్రామీణ బ్యాంకు వారి మాటల తీరు నచ్చక పామిడి వేరే బ్యాంకులోకి బదిలీ అయిన సంఘం వారు ఎద్దులపల్లి బ్యాంకులో ఉన్న రాజేశ్వరి సంఘం పొదుపు అకౌంట్లో ఉన్న అమౌంటు పామిడి బ్యాంకు వారికి ట్రాన్స్ఫర్ చేయాలని సంఘం తీర్మానం సీసీ సంతకంతో సంఘం వారు వెళ్లినప్పటికీ అది ఇది అని ఏదో ఒక సాకుతో మహిళా సంఘం వారిని ప్రతిరోజు తిప్పుకుంటుంటే బ్యాంకు చుట్టూ, విసుకు ఎత్తిన మహిళా సంఘం వాళ్లు కలెక్టర్ ఆఫీసులో వారి గోడు విన్నవించి అర్జీ ఇచ్చినప్పటికీ కలెక్టర్ ఆఫీసులో అర్జీ ఇస్తారా అంటూ కక్ష సాధింపుగా నేను చెప్పినదే వేదం అంటూ ఏపీజీపి బ్యాంకు ఎద్దులపల్లి ఫీల్డ్ ఆఫీసర్ మీరు ఎవరికి చెప్పినా ఏమి చేయలేరని నేను చెప్పిందే వేదం అంటూ మే 19 నుండి జూలై 16 గురువారం వరకు రెండునెలలుగా చెప్పులు అరిగేలా తిరిగినప్పటికీ అడిగితే మా బ్యాంకులో నెట్ లేదు ఇతర బ్యాంకులకి ట్రాన్స్ఫర్ చేయలేం ఇక్కడ అకౌంట్ చేసిన వారికి ప్రతి ఒక్కరికి అకౌంట్లో ఉండాలని వారు అకౌంట్లకు మాత్రమే ట్రాన్స్ఫర్ చేస్తామంటూ చెప్పినప్పటికీ అయ్యా ఇక్కడ ఉన్న అకౌంట్లన్నీ సంఘం ఏర్పడినప్పటినుండి ఉన్న అకౌంట్ లు ఉన్నాయని చూపినప్పటికీ మీరెవరు అడగడానికి సిసి, ఏపీఎం లేదా అనిమేటర్ రావాలని దబాయిస్తూ మహిళా సంఘాలపై విరిచుక పడుతూ దుర్భాషలాడుతూ ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోపోండంటూ మహిళా సంఘాలపై విరుచుకుపడుతున్నారు. అనిమేటర్ ఆల్రెడీ మూడు సార్లు ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ చుట్టూ బ్యాంకు చుట్టూ తిరిగినప్పటికీ ఎటువంటి స్పందన లేదని అనిమేటర్ చెప్పడంతో మహిళా సంఘాల వారు వెళ్లినప్పటికీ, అని మీటర్ సిసిఏపియం వాళ్లు వస్తేనే స్పందిస్తామని ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ చెప్పుకుంటూ కాలయాపన చేస్తూ ఉండడం గమనార్హం, కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు మొరపెట్టినప్పటికీ స్పందించని ఫీల్డ్ ఆఫీసర్ పై చర్యలు తీసుకొని మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడాలని పామిడి వెలుగు ఆఫీస్ కార్యాలయం అధికారులపై మరియు ఎద్దులపల్లి ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఎద్దులపల్లి ఏపీజీబీ బ్యాంకు వీరి ప్రవర్తన నచ్చకనే ఆల్రెడీ పది సంఘాలు వేరే బ్యాంకులకి మారాయని అయినా వీళ్ళు పనితీరు మారలేదని మహిళా సంఘాలు గ్రామ ప్రజలు చుట్టుపక్కల గ్రామ ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా సంబంధించిన అధికారులు ఇటువంటి అధికారులుపై చర్యలు తీసుకోవాలని, మహిళా అభివృద్ధికి తోడ్పడాలని,ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని మహిళా సంఘాలు ప్రజలు కోరుతున్నారు.

# న్యూఢిల్లీ లోని "భారత్ టెక్స్" నందు ప్రత్యేకతను చాటిన ధర్మవరం పట్టు





ధర్మవరం,జులై17.అక్షర టైమ్స్:- న్యూఢిల్లీలోని"భారత్ టెక్స్"నందు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత జూజారే నాగరాజు తన ప్రతిభను చాటి దేశంలోనే మరోసారి మరింత గుర్తింపు పొందారు. వివరాలకు వెళితే 2026 సంవత్సరం జులై 13-17 వరకు న్యూ ఢిల్లీ లోని భారత్ మంటపం నందు జరిగిన అంతర్జాతీయ వస్త్ర వినియోగదారుల సమ్మేళనం కార్యక్రమం నందు, ధర్మవరం పట్టణానికి చెందిన జాతీయ అవార్డు గ్రహీత జూజారే నాగరాజు ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చిన సందర్శకులకు ధర్మవరం పట్టు చీరలు, పట్టు పావడల విశిష్టతలను విశధికరించి తెలిపారు. ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారికి చేనేత మగ్గముల ద్వారా తయారు చేసి అందిస్తున్న వస్త్రాల ప్రేత్యేకతలను విశధికరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత శాఖ మంత్రి వర్యులు సవిత ప్రేత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమం లో రాష్ట్ర హస్త కలల చైర్మన్ హరిప్రసాద్ గారు, డెవలప్మెంట్ కమీషనర్ బినా , ప్రముఖ సినీ రచయిత,రాజమౌళి తండ్రి విజయేశీంద్ర ప్రసాద్ , రాష్ట్ర చేనేత కమీషనర్ రేఖరాణి , టీటీడీ బోర్డు మెంబెర్ సుచిత్ర యెల్ల గ పాల్గొన్నారు. అతిథులందరికి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రతిమలను డిజైనర్ జూజారే నాగరాజు అందజేసి, తదుపరి ముఖ్య అతిథులను అందరిని వారు సత్కరించారు.